లంకంత బంగ్లల కడుగు పెడ్తంటె, దినాం పొయ్యేద్దే అయినా, గాయల్ల మాత్రం గుండెకాయ నోట్లో కొచ్చినట్లయింది మల్లిగానికి. కాదా మల్ల! మొట్టమొదటిసారి పైసలడుగనీకి పోవట్టె!

మల్లిగాడు పొయెటేల్లకు ఆరాం కుర్సీల ఊక్కుంట దివాన్ ఖాండ్లనె కూసుండు దొర. తల్కాయె లేపలె. 'సూసినప్పుడె ఆయెతీ' అనుకొని మల్లిగాడు గూడ సప్పుడు చెయ్యలె. మొగురాన్నానుకోని గమ్మున నిల్సుండు.

నడిమట్లోసారి తల్కాయె లేపి, "ఊఁ" అని మూల్గినట్లు చేసిండు గాని, మల్లిగాడు సదురుకునెటాల్లకె మల్ల పేపరు ముంగలేసుకుండు. 'సరే, తీ!' అనుకోని మల్ల యెప్పటిలెక్క నిల్సుండిపొయ్యిండు మల్లిగాడు.

ఆకిరికి "హాఁ" అని నోటి ముంగల రొండు చిటికెలేసుకొని కండ్లనీల్లు తూడ్సుకున్నంక నెమ్మలంగ నెత్తెన్క చేతులు పెట్టుకుండు దొర.

గప్పుడు గూడ మాట్లాడలె మల్లిగాడు.

"అగో ... ఏందిరో... ఎన్నడు లేంది, గట్ల నిలబడ్తివీ మాటా ముచ్చటా లేకుంటా!" ఆకిరికి ఆయనెకే అడుగవలసొస్చింది.


గా మాట కోసరమే యెప్పట్నుంచో సూస్తున్న మల్లిగాడు మొగురం పొంటె జారి కింద కాల్లమీన కూలబడ్డడు నిట్టూర్సుకుంట.

"అగో ... ఉల్కడు పల్కడేందిరో అడుగుతుంటె గూడ?" అన్ని సూస్తంటె దొర క్కాడ 'ఏందిరో' అనిపిచ్చి మల్ల అన్నడు.

# అడివి తల్లి గంతేసింది



కొమ్మిడి మత్స్యేంద్ర రెడ్డి





"కొంచెం పైక మవుసరముండె ...." గులిగినట్లన్నడు మల్లిగా డప్పుడు.

"య్యేందీ....!" రెట్టిచ్చిండు దొర సరిగ్గినబడక, "లాజిగ మాట్లాడనీకె చాతనయిత లేదుర?"

"అది కా ద్దొర! కొంచెమంత పైక మవుసరముండె ..." యీ సారెట్లనో లాజిగ అననయితె అన్నడు గాని, అంటున్నప్పుడు మాత్రం మెడ సుట్టూత సల్ల చెమ్టలు పడ్తున్నట్లయింది.

అదిన్నంక ఆలోచండ్ల పడక తప్పల దొరకు. యిన్నేండ్లల్ల ఫస్టయిమ్ ఇది కావాలని అని నోట్లెకొచ్చిందంటె ఆలోచండ్ల పడవల్సిందే మల్ల.

గట్ల ఆలోచిచ్చి ఆలోచిచ్చి, "కొంచెమంతంటె ...?" గుచ్చి గుచ్చి సూసుకుంట అడిగిండు.

"కొంచెమంతంటె ..." చెప్పబోతున్నోడల్ల గాడి కొచ్చెటాల్లకు మల్ల గమ్మునయిపోయిండు మల్లిగాడు.

జెరసేపు యెదిరి సూసినంక "అగొ ... పొలగానివారు! నోట్లె మాట నోట్లనె దాపెట్టుకుంటె యివతలోల్లకు ఎట్ల తెలుస్తదనుకుంటున్నవు!" గద్దిచ్చిండీసారి దొర.

గాయంత గద్దింపుకె గజ్జుమన్న మల్లిగాని నోట్లకెల్లి "నూరు ..." అన్న మాట ఎవలో నూకినట్లు బయటకొచ్చింది.

తుపాకి గుండొచ్చి నొసలు నడిమిట్ల తగిలినట్లు అదిరిపడ్డడు దొర. "యేందిరో! గంత రొఖం నేనే యెప్పుడు సూల్లె!" కండ్లన్ని యెడల్పు చేసి మస్తు ఆశ్చర్యంలోంచి అన్నాడు.

నేల సూపులు సూసుకుంట చెప్పుకొచ్చిండు మల్లిగాడిక. చెప్పకోకుంటెనేమొ యెల్లదాయె!

"లచ్చుమవ్వకు రేపో మాపో నొప్పులొచ్చెదట్లున్నయి, దొర! బోస్గీర్ల యెవలో డాక్టరమ్మ దావఖాన తెర్సిందంట. రొండు నూర్లదంక కర్సయితదంటుండ్రు..!" పోరగాల్లు పాట మప్పజెప్పినట్లు దబ్బదబ్బ చెప్పేసి నెత్తి న్యాలకేసిండు మల్ల.

గా మాటలిన్నంక యిగేమనాలో సమజ్‌కు రాలె దొరకు. కొత్త కొత్త సంగతులు ఇంటున్నట్లనిపించింది.

"ఓ దిక్కు రొండు నూర్లయితయనుకుంట ... మల్ల నూరె అడగుతవేందిర?" అని మాత్రం అన్నడు.

గా మాటలకు జవాబియ్యెలె మల్లిగాడు. తల్కాయె గూడ లేవలె.

"ఇంకో నూరు యాడికెల్లి తెస్తవు? నీ దగ్గరున్నయా?" అయనే అడిగిండిగ.

"నా దగ్గరేం లేవు. కాయితం రాయిచ్చుకోని కోమటి రంగయ్య ఇస్తనన్నడు!" తప్పు చేస్తున్నట్లు చెప లేక చెప్పలేక చెప్పిండు.

"హా... గట్ల చెప్పవు మల్ల! దావఖాన సంగతి గూడ అడె చెప్పిండు గద?" మతలబేందో తెల్సిపోయినట్లు మల్ల కుర్చీల యెన్కకు ఒరిగిండు దొర.

చిన్నగంటె చిన్నగ తల్కాయాడిచ్చిండు మల్లిగాడు.

"అయినా, నాకు తెల్వకడుగుత గని, నీయి నాల్గు నూర్లు జమయినయని తెల్సిగూడ కోమటోని దగ్గర కాయితం రాసుడెందుకుర మల్ల? తాతల కాలం నుంచి అయినదానికి, కానిదానికి గిట్ల కాయితాలు రాసి రాసి బతుకులు బండలు చేసుకుంటరు. థూ ..." మస్తు కోపంతోటి కూసున్న జాగలకెల్లే కాకిరిచ్చి బయటికి ఊసిండు దొర.

గా మాట లినంగనె గుటుక్కుమన్నది మల్లిగానికి. "గట్ల కాద్దొర ...! రొండు నూర్లడిగితె నువ్విస్తవో లేదో నని ..." నసిగిండు.

గా మాటలిన్నడో, లేదో ... మొకమంత ఎర్రగయింది దొరకు. "ఓహో...! దొరలంటె దొంగలంటె కొడుకులు. జీతగాల్ల పైసల్ని మింగి కూసుంటరు. ఇగ ఈ కోమటి కొడుకులేమొ కాయితాలు రాయిచ్చుకోని ఊరిని ఉద్దరిస్తరు. గంతే కద నువ్వనెడిది? అసలు, లచ్చుమవ్వను దవఖానకు తీస్కపోకుంటె పురిట్లనె సస్తదని చెప్పలె! అఁ..."

మాటమీన మాట దిమ్మిన గుద్దినట్లు తగుల్తుంటె ఉచ్చబడ్డది మల్లిగానికి. సటుక్కున లేసి నిల్సుండు.

ఇంకయిపోలె దొరది. "అరె... పాగల్ ముండకొడుక! యేదన్న రోగమొ, రొప్పో అయితే సరె ...! దవఖాండ్ల పైసలు కాలబెడ్తరు గనీ, మన ఊరి ఆడ దెవతన్న ఇండ్ల తప్ప బయట కన్నాదిర? అరె ... నీ గ్గింత గూడ సమజ్‌కు రాదు!" కోపమంటె, కోపంతోటి దుమ్ము


దుల్సిండు.

ఆయున ముంగల నిల్సోవాలంటె ఇగ ఒశపల్లె మల్లిగానికి. లాభం లే, ఇగ ఎల్లిపోదామనుకుండు.

"ఇంకేంది గట్ల నిల్సున్నవ్...! ఫో! లోవల దొర్సాని కింత చాయ్ పెట్టుమని చెప్పు! నువ్వు గూడ ఇంత సల్ల తాగు! గా మొకం సూడు, యెట్ల పీక్కపొయిందో ... పొద్దుట్నించి కడుపు లేమన్న బడ్డదా అసలు ... ఆఁ..." యెదురుంగుంటె యింకేం మాటలొస్తయో నని తరిమిండు.

జెరసేపయునంక చాయ్ తెచ్చిచ్చి మల్ల మొగురా న్నానుకుండు మల్లిగాడు. ఈసారి దొర్సాని తలుపుసాటుకు లోపలిదిక్కు నిల్సుంది.

చాయ్ రొండు బుక్కలు తాగినంక చెప్పిండు దొర "అది గాదుర, మల్లిగ ... కోమటోని దగ్గెర అప్పులు తప్ప మీ నాయిన నీ కేమిచ్చి పొయ్యిండుర? యెట్లనో గయున్ని తీర్పుకుంటివి.




మీనికెల్లి నాల్గునూర్లదంక కూడబెట్టుకుంటివి. గా పైసలు సూసినప్పుడల్ల మీ ఆలు మగల చెమట వాసననె ఒస్తదిర నాకు! రాత్రనక, పగలనక గట్ల కూడబెట్టిందెందుకు ... గిట్ల కర్సుపెట్టనీకెన? మొన్ననె మంగలి సోమన్ని పిలిపిచ్చి మాట్లాడిన. మన తోట నానుకొని ఉన్న అయిదెకరాల చెల్క అమ్ముతండంట. యెకుర నూరు చెప్తుండు. ఆనికి తొందరుంది. బోస్గీర్ల దుక్నం పెడ్తడంట. రొండు దినాలల్ల ఇంకో మాట చెప్పుమన్న. యెట్లగన్న ఇస్తడు. బాయి కొట్టిచ్చుకుంటె బంగారం ఖాస్తయితది. నువ్వు గూడ అందరిలెక్క బతుకొచ్చు కదర! ఇంకేమన్న తక్వ బడ్తె యెన్కపొంటి నేనుండనె ఉంటి. తాతల కాలం నుంచి జీతగాల్ల లెక్కన బతికితిరి. నువ్వన్న సొతంత్రంగ బతుకాలన్నదె నా ఆశ. గంతె కాని, నువ్వేందిర ... పాగల్ ముండకొడుకువు ... గా

కోమటోని మాటలు పట్టుకోని ..." గింత పొడుగు చెప్పుకొచ్చి చాయ్ గిలాస కిందపెట్టిండు.

కొంచెంసేపు ఇగెవ్వలు మాట్లాడలె. మల్లిగాడె ఒంగి గిలాస తీసుకుంట గులిగిండు "గది కా ద్దొర! తొల్సూరు కాన్పు ...!" లచ్చుమవ్వ కండ్లల్ల కదుల్తాంటె మనసులున్న మాట బయటకొచ్చింది.

గప్పుడు దొర గొంతు మల్ల పెద్దగయింది.

"ఇంటున్నావె...!" తలుపెన్క నిల్సున్న పెండ్లాంతోటి అన్నాడీసారి. "ఈని పెండ్లాని కొక్కదానికే తొల్సూరి కాన్పంట. ఊర్లె ఇంకెవ్వలు కంటలేరంట ... చెప్పనీకె జెరంత సిగ్గుండాలె!" మల్లిగాని దిక్కు మర్లిండు. "యెప్పుడన్న నిన్ను నువ్వు సూసుకున్నవుర? రొండు చేతులతోటి రొండు ఒడ్ల బస్తలను అల్కగ లేపి బండ్లేస్తవు. యిగ లచ్చుమవ్వ కేమయిందంట? గిచ్చితె నెత్తురు కార్తది. మరి గిట్ల బయపడ్తె, యిగ కట్టెపుల్లల్లాసుంటి దొర్సానేమనాలెర? వంచె పాండవుల్లెక్క అయిదుగుర్ని కన్నది. ఎప్పుడన్న ఊరు దాటి బయటికి పోంగ సూసినవ?"

"అవ్వుర, మల్లిగ! నువ్వేం బుగుల్ బడకు. లచ్చుమవ్వ నీల్లాడెదంక బంగ్లలనే ఉంటది. అప్పటిదంక మంత్రసాని గూడ ఈడనె ఉంటది. నేను గూడ పక్కలనే ఉంటి. సూస్తుండు, గుమ్మడి పండట్లాసుంటి బిడ్డను కంటది!" దొర్సాని గూడ భరోస ఇచ్చినంక ఇగ మాట్లాడనీకి ఇంకేం మిగల్లే మల్లిగానికి. తల్కాయ ఊపుకుంట బంగ్లలకెల్లి బయటకు నడిసిండు.

యెట్లయితేంది ... దొర నాలికెకు మచ్చగీన ఉందేమో మల్ల! పది దినాలల్ల బంగ్లలనె పండంటి బిడ్డను కన్నది లచ్చుమవ్వ. గింత గూడ నొప్పి కాలె. గింత కూడ కష్టం కాలె. జెరసేపట్ల బిడ్డ బయటకొచ్చి కయ్యిమన్నది. గప్పుడు గాని మల్లిగాని మొకంల నగు కన్పియ్యలె.

ఇంటికి పోయెదప్పుడు, గయుల్ల కండ్ల నీళ్లు నింపుకోని దొర్సాని కాళ్లు మొక్కిండ్రు ఆలు మగలు. కొత్త చీర దోసిట్ల పెట్టి నోటినిండ దీవిచ్చింది దొర్సాని.

"అరేయ్...! అమాసెల్లినంక చెట్లకిందికి పొయ్యేద్దున్నది. గాయుల్లనే గీ బుడ్డోని గ్గూడ పేరు పెడ్దారి!" దొర నగుకుంట చెప్తుంటె యేడుపొచ్చింది మల్లిగానికి. ఏడుపొస్తుంటె గూడ నగిండు నెత్తూపుకుంట.

***

ముందుగాలనుకున్నట్లె జీతగాల్లను ఆల్ల కుటుంబాలతో సహా మర్రికుంటకాడ యిందులు చేసుకోనీకి బయల్దేరిండు దొర.

అందరికంటె ముందర కచ్చురంల దొర దొర్సాని తొవ్వ తీసిండ్రు. సవారి కోసరమె పెంచి పోషిచ్చిన రామలచ్మనులు గునగున అడుగులేస్తుంటె మెడలల్ల గజ్జెలు ఘల్లుఘల్లుమంటున్నాయి. యెన్క బండ్లనేమొ లచ్చుమవ్వ బుడ్డోనికి పాలిచ్చుకుంట మురిపెమంటె మురిపెంతోటి ముచ్చట చెప్తుంటే, యెడ్లను అదిలిచ్చుడు మరిసిపొయ్యి గాలిల తేలిపోవుడు షురు చేసిండు మల్లిగాడు.

గట్ల ఒకదానెనుకొకటి నాలుగయిదు బండ్లు సోల్పూతగొస్తున్నాయి. ఎండింక యెక్కలె. సల్లటి గాలి సయ్యిమంటుంటె, ఒయిసులున్న పోరగాల్లు కొందరు బూతు పాటలందుకుండ్రు. 'జెర మెల్లగ! కచ్రంల దొర కూకుండు!' అని ముసలోల్లు మందలిస్తుంటె, గయున్ని తమమీదనె అని ఓ దిక్కు సిగ్గుబడ్తున్నట్లు చేసుకుంటనే, ఇంకో దిక్కు ముసిముసి నవ్వులు నగుకుంటుండ్రు ఆల్ల ఆడోల్లు.

"అగో ... యెందిరో...! అదిలియ్యుండ్రి .... అదిలియ్యుండ్రి! యెండెక్కెనాంటె కల్లు పులుసయిపోతది. సూడుండ్రి, మల్ల మీ యిష్టం!" అనుకుంట దొర ఇగ కచ్చురాన్ని ఉర్కిపిచ్చుడు షురు చేసినంక గాని, యెన్క బండ్లకు పానం రాలె.

మర్రికుంట అంటె యేందంటె, ఊరికి నాలుగయిదు మైల్ల దూరంల పర్తపురం అడివి నానుకోని ఉంటది. దొరకున్న నాలుగయిదు యవసాయపు బావులల్ల అదొకటన్నమాట. ఆ బాయి కాడ దగ్గెరదగ్గెర నూరు, ఇన్నూరేండ్ల ఒయసున్న మర్రిచెట్లు ఎటు లేదన్న ఎకరం జాగల ఊడలు బెట్టింది. బూమికి జానెడెత్తులున్న ఊడలమీద కుర్సీలల్ల కూసున్నట్లు మంచిగ

కూసోవచ్చు. యెంత యెండకాలమున్న గాని, కొమ్మలను దాటి కిందికి రాదు యెండ. ఆ సుట్టుపక్కల ఊర్లన్ని యెప్పుడు యిందులు చేసుకున్న ఆడనే! యెండ కొడ్తదన్న బయం లేదు, ఆన వడ్తదన్న బుగులు లేదు.

బండిడిసింరో లేదో, పాలోమని యెవ్వలి వన్లల్ల ఆల్లు మునిగిపొయ్యింరు. ఆడోల్లేమొ బియ్యాలు కడుక్కుంట ఒంట వన్లల్ల బడ్డరు. దొర్సాని గూడ నడిమిట్ల కూసోని, అమ్మలక్కల ముచ్చెట్లినుకుంట కూరగాయలు ముంగలేసుకుంది. ఇగ పోరగాల్ల ముచ్చటయితె చెప్పుకుంరి!

సుట్టుముట్టు ఇంత లొల్లయితున్న దొరయితె పక్కకు సూస్తలేడు. ఏం పట్టిచ్చుకుంటలేడు. జుంబఖానమీద బుడ్డోన్నేసుకోని కూకున్నడు. ఆడంటె ఆయనకు ఎంత పానమంటే అంత పానం! సమజ్ కాని సప్పుల్లు సేసుకుంట ఆన్ని నగిపియ్యనీకె తంటాలు పడ్తుంటె, పోరగాల్ల కోసరమని కొమ్మలకు ఉయ్యాలలు కడ్తున్న మల్లిగానికి నగంటె నగొచ్చింది. "గదేంది దొర? బుడ్డోని కంటె నీ లొల్లె యెక్వయింది!" నగుకుంటనె అన్నడు.

గా మాటలు చెవుల పడంగనె! అర్రె.... దొంగ దొరికె కదర!' అని ఒక్క సెకండు సిగ్గుపడ్డడు దొర. అయితే గూడ బయటపల్లె. "అవును మల్ల! కననయితె కన్నరు గని, యెప్పుడన్న గిట్ల ఆడిచ్చిన్రార్రా!" బుడ్డోని బుడ్డబుడ్డ చేతులు ఊపుకుంట అన్నడు.

మల్లిగాని కండ్లు శెమ్మగిల్లిన యా మాటలకు. "నిజ్జంగ, దొర! నీ నీడ లేకుంటె మేమంత యేమయ్యేటోల్లమో!" ఆయన పాదాలను ముట్టుకోని అంటుంటె దొర గ్గూడ యెట్లనో అనిపించింది.

"ఆc...ఆc... యెట్ల టైముంటె అట్ల మాట్లాడ్తవు దొంగ ముండకొడుక! గాయిల్ల దవఖాన కొడ్దంటె ఎట్ల సూసినవుర ... మర్సిపోయినవా? తినెదట్లు సూడలె?" అని నెత్తిన చిన్నగ డిప్ప కొట్టిండు.

"అవు, దొర! నా కొక్కసారనిపిస్తది, మనిషి మనిషికి నడిమిట్ల గిన్ని బందాలు లేకుంటె ఈ లోకమెట్లుంట దేనిపిస్తది. ఎవ్వరి మానానికి ఆల్లు అడివిల జంతువుల్లెక్క బతుకుతలేమో మల్ల. లేకుంటేంది దొరా ... రాత్రయ్యిందంటె ఎప్పుడు తెల్లార్తద ... ఎప్పుడెప్పుడు బంగ్లకు పోదారా అని నేను, దొర్సానికేం పనుందోనని లచ్చుమవ్వ ఏంత ఇదయిపోతమని ... సచ్చుంగ దొరా! రేపటికోసం ఎదిరి సూసుడు లేకుంటె మాత్రం బతుకుల మజా లేదు!" చెప్తున్న మల్లిగాడు లబ్బలబ్బ మొత్తుకుంటొస్తున్న లచ్చుమవ్వను సూడంగనె దిగ్గున లేసిండు.

"దొర ... దొరా! దొర్సాని ... దొర్సాని ..." రొమ్ముల మీన చెయ్యేసుకోని దమ్ము తీస్తుంటె మాట్లాడొస్తలేదు దానికి.

'దొర్సాని' అన్న మాటినంగనె ఉల్కిబడ్డా రిద్దరూ.

"ఆc... దొర్సాని...? యేమాయె దొర్సానికి?" పెండ్లాన్ని కుదిచ్చుకుంట అడిగిండు మల్లిగాడు మెడ నరాలు ఉబ్బుతుంటె.


"దొర్సాని ... దొర్సానిని చిర్తపులి గుంజుక పోవట్టె...!" మొగన్ని కావలిచ్చుకొని చాన కష్టంతోటి చెప్పింది యెక్కిళ్లు తీసుకుంట.

ఝుల్లుమన్నది మల్లిగాని కా మా టినంగనె. అది గూడ ఒక్కటంటే ఒక్క సెకండు. గంతే! పాదాలు బూమ్మీన అన్తలేవు. రెక్కల గుర్రం లెక్క గాలిల తేల్తున్నడు.

ఎక్కడి పనులు అక్కడ్నె ఇడిసి ఎన్కనె పరుగులు పెట్టింర్రు ఆడోల్లు, మొగోల్లు. కాని దొర మాత్రం మర్రిచెట్టు కిందనుంచి ముందుకు కదలలె. నిద్రబోయినట్లు నిల్సుండిపొయ్యిండు. యేం సదువుతుండో, ఏ దేవునికి మొక్కుతుండో గని, ఆయన పెద్వు లొక్కటే కదుల్తున్నయి.

ఆరడుగుల కన్న యెక్వ పొడుగే వుంది. మూడడుగుల కన్న యెక్వ యిస్రమె వుంది. సూస్తనె సాలు ... గుండె పగిలి సచ్చేదట్లున్న చిర్తపులి నోట్లె దొర్సాని కాలు ఇరికి గిలగిల కొట్టుకుంటున్నది. దయ లేదు, గియ లేదు. బయం లేదు, బక్తి లేదు. రాల్లమీద కెల్లి, రప్పలమీదకెల్లి గొర్రగొర్ర గుంజుకపోతున్నది. యెవలొస్తరో సూస్త అన్నట్లు.

చేతికేదందితె గది దొర్కపుచ్చుకోవాలని




ఆని నూకుడుకు లచ్చుమవ్వ అంత దూరం ఇరుసుకబడ్డది.

కాలు కదుపుడు కాదు ... దొరయితె రెప్ప కొట్టుడు గూడ మర్సిపొయ్యిండు. మడిమెలు బూమిల పాతుకునిపోయినట్లు నిల్సుండిపొయ్యిండు. గా టయుమ్‌ల గాయనకు పక్షవాతమొచ్చి కాలు చెయ్యి పడిపొయినట్లయింది.

అప్పటికే అడ్డమొచ్చిన గాలిని సర్రున కోసుకుంట, రాములోరి బానం వోలె దూసుకుపోతుండు మల్లిగాడు.

తొడల కండలు పచ్చెలు పచ్చెలయి చెడుగుడు ఆడుతుంటె, చెవుల యెన్కనుంచి కారుతున్న చెమట బుజాలమీద నుంచి ఈపుల తేలిన పాయలల్ల కాల్వలై పారుతుంటే, ఆని బూమ్మీన గీరుకుంట, యేది దొర్కక యేడ్సుడు గూడ చాతకాక తల్లడిల్లుకుంట, కాయితం లెక్క, కట్టెపుల్లలెక్క కొట్కపోతున్న దొర్సానిని గంత దూరం నుంచి సూడంగనె మల్లిగాని కండ్లల్ల నెత్తురు చిత్తింది. కొండలెక్క పొంగిన ఛాతి భల్లున పలిగింది. అది యేడుపో ... మల్ల లేకుంటె గుండెకాయ గిన పొక్కలు బడ్డదో గని, ఆని నోట్లెకెల్లొచ్చిన సప్పుడుకు మీదున్న మొగులు, కిందున్న బూమి గజ్జున వణికినయి. గా సప్పుడుకు యెన్కవట్లొస్తున్నోల్లు గోడగ్గుద్దుకున్నట్లు యెక్కడోల్లక్కడ్నే ఆగిపొయ్యింరు.


జుంపాలు ఒదులు చేసుకుంటున్న సిమ్మం లెక్క నెత్తిని ఊపుకుంట, అరికాల్లను బూమికి

మిగతా 47వ పేజీలో....

....41వ పేజీ తరువాయి

# సల్మాన్ ఎంత మంచోడో!

'సంఘర్ష్' చిత్రం ఫ్లాప్ అయినా అందులో నటించిన ప్రీతీజింటాను అందరూ గుర్తించారు. చక్కగా నటించిందని ప్రశంసించారు. హీరోయిన్ అంటే షోపీస్ మాత్రమే కాదు, ఏ కాస్త అవకాశమున్నా నటించిచూపుతుంది-అనటానికి ఈ చిత్రంలో ప్రీతి నటనే ఉదాహరణ అంటున్నారట. యశ్‌చోప్రా, వినోద్‌చోప్రాల చిత్రాల్లో హీరోయిన్లకు తగినట్లుగానే పాత్రలుంటాయంటూంది ప్రీతి. కొందరు వినోద్‌చోప్రా హీరోయిన్లతో సరిగ్గా బిహేవ్ చేయరని జనం చెప్పుకుంటుంటారు కదా, మరి నువ్వేమంటావు?-అనడిగితే "నాతో ఆయన ఎప్పుడూ మర్యాదగానే ప్రవర్తించారు" అంటూనే సల్మాన్‌ఖాన్‌ను చాలా ఇదిగా పొగిడేస్తూంది ప్రీతి. 'చోరీ చోరీ చుప్‌కే చుప్‌కే' చిత్రం షూటింగు సమయంలో తను బాగా నటిస్తుందనుకున్న దృశ్యాల్లో సరిగ్గా చేయలేకపోయిందట. ఆ సందర్భాల్లో సల్మాన్ తననంతో ప్రోత్సహించి, తను బాగా నటించేందుకు సాయపడ్డాడంటూంది ప్రీతి. అసలే... అదోలాగున్నాడు సల్మాన్. జాగ్రత్త ప్రీతి, పారాహుషార్!



ఎస్.

ఒత్తివట్టి గంత దూరం నుంచే గాలిల లేసిండు మల్లిగాడు.

గట్ల లేసిన మల్లిగాడు కండ్లు మూసి తెరిసేటంతల రెక్కలిప్పుకున్న గరుత్మంతుని లెక్క చిర్తపులి యీపుమీద బడ్డడు, అది బూమిల దిగబడేదట్లు.

యేదో గుట్ట గిన దొర్లుకొచ్చి మీద బడ్డట్లయిన చిర్త ఒక్కసారే కూలబడ్డది. గప్పుడు దాని నోట్లోనుంచి బయటపడ్డ దొర్సాని, గా అదురుకు గంత దూరం దొర్లుకుంట పోయింది.

యెప్పుడయితె ... దొర్సాని లచ్చుమవ్వ చేతులల్ల చేరిపొయ్యిందో ఇగ గప్పుడు, గప్పటిదంక ఒకదాని కొకటి అత్కపొయ్యిన మల్లిగాని దవుడలు ఒదులయినయి. పెదవులు గూడ కొంచెం కొంచెం తెర్సుకోని ... నగిండో యెందో ... మల్ల .... తెల్లటి పండ్లు తళుక్కున మెరిసినయి.

యెప్పుడయితె, దొర్సాని దిక్కు సూసిన సెకండుల పట్టు ఒదులయిందో, ఈపు మీది మల్లిగాన్ని ఇసిరి నేలకు కొట్టింది చిర్త.

ఇగ గప్పుడు షురువయింది రామరావన యుద్ధం. చాటలెక్కున్న పంజాలను ఇష్టమొచ్చినట్లు ఇసిరి కొడ్తున్నది చిర్తపులి. నెత్తుటి మడుగుల మునిగి తేలినట్లయిండు మల్లిగాడు. అయిన గూడ యెన్కడుగెయ్యలె. ఆ చిర్తకంటె చిందరబొందరగ. ఆ చిర్త గ్గూడ అంతు చిక్కకుంట చిందులు తొక్కిండు. తొక్కి తొక్కి మల్లొకసారి గాలిల లేసిండు. ఆ లేసుడు తేసుడు ఈసారి సక్కగ దాని ఈపుమీద వాలిండు. అది గూడ, అటో కాలు, ఇటో కాలేసి పొట్ట పలిగెదట్లు డొక్కలు ఒత్తుకుంట.

ఆ బాదకు బూమి ఇచ్చుకపోయెదట్లు గాండ్రిచ్చుకుంట మెడను యెన్కకు తిప్పింది పులి. అందుకోసమె ఎప్పట్నుంచో సూస్తున్న మల్లిగాడు తెరుసుకున్న దాని నోట్లెకు దూలాల్లెక్కున్న చేతులు కుక్కిండు. గట్ల చేతులు కుక్కుతుంటె 'గీ నోరేన పువ్వట్లాసుంటి మా దొర్సాని నెత్తురు తాగింది!' తెల్వకుంటనె మల్లిగాని నోట్లనుంచి గా మాటలు బయటకొచ్చినయి. మొగులు పగిలిపోయెదట్లు అరుసుకుంట కింది దవుడను కిందికి, మీది దవుడను మీదికి పల్గచీరిండు.

యిగ చిర్తపులి చేసే సప్పుల్లకయితె అడివంత అల్లకల్లోలమయింది. అయిన గూడ ఉడుంపట్టు ఇడ్వలె మల్లిగాడు. "గీ నోరేన మా దొర్సానిని నొప్పిచ్చింది!" మాటి మాటికి ఆని దమాక్‌ల గదే మాట సుడులు తిరుగుతున్నది. అట్లనిపిచ్చినప్పుడల్ల దవుడలు పల్గదీస్తా బొయ్యిండు. అది మెసుల్తున్నకొద్దీ గట్లనే చీర్తా బొయ్యిండు. ఆకరికి ఇగ చిర్తపులి మెసులుడు ఆపెటాల్లకు దవుడలు పూరా మెడ సగందంక చీరేసిండు. అప్పుడు గాని ఆపలె.

గప్పుడు సూడుంరి. గంత పెద్ద అడవిల పిట్టలు గూడ సప్పుడు చెయ్యలె. గాలి గూడ గడ్డకట్టిన గా టయింల గప్పుడు సూడుంరి. నగిండు దొర! ఎప్పుడొచ్చిండో మల్ల ...! యా కాలమాయెనో సూడవట్టి, బాయిల గుండు బడ్డట్లు భళ్లున నగిండు. నగీ నగీ కండ్లల్ల కెల్లి నీళ్లచ్చిందంక గట్లనే నగుతా బోయిండు.

ఆ సప్పుడుకు దొర చేతులల్ల బుడ్డోడు గూడ గాంది తాత లెక్క బోసిగ నగుడు షురు చేసిండు. గప్పుడు గది సూసినంక, పెయ్యంత కార్తున్న నెత్తురు అరికాల్ల కింద మడుగులు కడ్తుంటె గూడ పట్టిచ్చుకోకుంట హాయిగ నగిండు మల్లిగాడు.

మల్లిగాడు కదిలినంక గాని అందరిల చెలనం రాలె. ఒచ్చినంక ఇగ ఆగుతరా?

అప్పుడు ... ఆ సప్పుడుకు మెల్కొచ్చింది అడవికి. మెల్కొచ్చి సుట్టుముట్టు సూసినంక ముక్కుమీద యేలేసుకుంది.

దొరోల్లు, వనోల్లు గట్ల మబ్బులల్ల నీళ్ల లెక్క కల్సిపొయ్యి దుంకుతుంటె గా టయమ్‌ల యిగ అడవితల్లి గూడ యెగిరి గంతేసింది!

